# లెక్కల మాష్టారు

విత్తు నాటనిదే మొక్క మొలవదు. మనం నాటాలని నాటకపోయినా ఒకో సారి మన ప్రమేయం లేకుండానే విత్తు నాటుకుని మొక్కవుతుంది. ఈ బీజవ్యాప్తిని మనం అరికట్టలేం. ఆలోచనా బీజాలూ అలాంటివే. ఎక్కడో చూసిందీ, ఎక్కడో విన్నదీ, ఎక్కడో చదివిందీ మనస్సులో, మేధస్సులో బీజరూపంలో మనకు తెలియకుండానే ఇరుక్కుపోయి అలా అలా మొక్కగా మొలిచేస్తుంది. మన తార్కికతకు పదును పెడుతుంది. కొత్త రూపాన్ని సంతరించుకుని నూతన భావనగా ఆవిర్భవిస్తుంది. ఇది నిజం కాకపోతే కోట్లాది పుస్తకాలలోని ఆలోచనలు అన్నీ నూతనమైనవేనా? అన్నీ మొదటిసారీగా చెప్పబడుతున్న, లోతైన, వాడైన, బలవత్తరమైన ఆలోచనలేనా? - కావు. ఎంతటి భావానికైనా తగిన పరిశ్రమ చేసి మధిస్తే దానికి ముందున్న ఆలోచన కనబడకపోదు. ఫలానాకవిలోని భావం అంతకుముందు మరోకవి చెప్పినదేనని చెబుతూ ఉంటారు. ఫలానా రాజకీయవేత్త ఆలోచన అంతకుముందే సూక్ష్మరూపంలో, కించిత్ బేధంతో ఇంకొకడు ప్రవచించి నదేనని చెబుతూ ఉంటారు. ఆలోచన విషయంలో ఇల్లాంటి తర్జన భర్జనలు తప్పవు. గొప్ప ఆలోచన యొక్క అనేక లక్షణాల్లో మళ్ళీమళ్ళీ వ్యక్తి మనసుని స్పందింపచేసి ఆలోచింపచేసే లక్షణం ఉదాత్తమైనది.

-"నువ్వు వేసే అడుగును ప్రతి మాటూ సగం చేసుకుంటూ పోతే నువ్వు అవతల చివరికి చేరలేవు."

క్లాసులో లెక్క తెగక బుర్ర బద్దలు కొట్టుకుంటున్న నాకు మాష్టారి వాక్యం వినిపించినా, దాన్ని పట్టించుకునే స్థితిలో లేదు నా మనసు.

మా లెక్కల మాష్టారు దేవుడు. ముందు ఆ మాట చెప్పకుండా అసలు ప్రారంభించడం నా చిందరవందర ఆలోచనలకి నిదర్శనం. నా లెక్క గొడవలో నేనున్నాను. బుర్రంతటితోనూ లెక్క రావడంలేదని విసుక్కుంటున్నాను.

- ఎంత ఇల్లాజికల్‌గా ఉంది నా స్థితి!

లెక్క రావాలంటే మస్తిష్కంతో ఆలోచించాలి. విసుగుతో నిండిన తల కాయకి లెక్కెలా వస్తుంది? ఈ జ్ఞానోదయం కావడానికి అదృష్టమని మన మనుకునే దైవకృప కావాలి.

"ఏం రామావతారం? నేను చెప్పింది విన్నావా?"

మాష్టారికి నా ముఖం మీద ముసురు కున్న భావమే కాకుండా, మనసులోని ఆలోచన సైతం చూడగలిగిన అంతఃచక్షువుంది.

"విన్నాను" మెల్లగా లేచి నుంచున్నాను.

"వివరించగలవా?"

"............"

"మరోసారి చెబుతా. వివరిస్తావా?

"నేను ఎటో ఆలోచిస్తున్నాను."

"అది నాకు తెలుసు. నీ లెక్క తెగడంలేదు. విసుక్కుంటున్నావ్. నీమీద నీకు కోపమో అసహ్యమో పెరిగి పోతోంది. అసహనం నీ మెదడుని మొద్దు చేస్తోంది. లేచి నన్నడిగితే లెక్క నేను చెప్పేవాడిని. ఒక్కక్షణం లెక్క గురించి ఆలోచించకు. నేచెప్పినదివిను. నువ్వు వేసే అడుగును ప్రతిమాటూ సగం చేసుకుంటూపోతే నువ్వు గది అవతల చివరని ఏనాటికీ చేరలేవు! ఇక వివరించు.

"ఒక్కఓణం - చెబుతా సార్!"

తెగకుండా మొరాయిస్తున్న లెక్క నా మనసులోంచి మాయమైంది.

గదిలోని ఈ చివరనుండి ఆ చివర వరకూ ఉన్న దూరం ఇరవై అడుగులనుకుందాం. మొదటి అంగలో అడుగున్నర ముందుకు వస్తే రెండవ అంగలో తొమ్మిది అంగుళాలు. మూడవఅంగలో నాలుగున్నర అంగుళాలు. పన్నెండవ అంగలో పదివందల ఇరవైనాలుగింట ఐదొంతుల అంగుళాలు మాత్రమే ఇలా అయితే జీవిత కాలంలో గది అవతల చివర చేరలేం.

నేను బిత్తరపోయాను.

"నీకు అవగతమయింది. సంతోషం. ఆలోచించగలిగినవాడివి - అందరూ ఆలోచించలేరు. అది వరమో శాపమో నాకు తెలియదు."

మాష్టారి మాటలు నాకు ఆరోజు బొత్తిగా - ఇంటర్ చదివేరోజుల్లో అంతగా అవగాహన కాలేదు.

మరుక్షణంలో మాష్టారు మమ్మల్నందరినీ నవ్వించి నాచేత లెక్క చేయించారు.

నేను ఇంటర్ మీడియట్‌లో ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. కాలేజీ అంతటకే కాకుండా, జిల్లాకే ఫస్టొచ్చాను. ఆ తరవాత ఇంజనీరింగ్ చదివాను; ఆ తరవాత పెద్ద ఇంజనీరింగ్ కంపెనీలో ఇంజనీరయ్యాను. ఆ తరవాత ఓ ఇంటివాడిని అయ్యాను. కంపెనీ నన్ను దేశమంతా తిప్పుతోంది.

మాష్టారిని మళ్ళీ కలవడం పడలేదు. ఎక్కడున్నా క్రిస్‌మస్ పండుగకి మాత్రం గ్రీటింగ్స్ పంపేవాడిని. అందినట్టు మాస్టారు దగ్గరనుంచి పోస్ట్‌కార్డు వచ్చేది వారి శుభాకాంక్షలతో సహా. అదే వాక్యం ఉన్న మాష్టారి దస్తూరితో ఉన్న కార్డులు నాదగ్గర ఇరవై ఉన్నాయి.

- ఉద్యోగం బదిలీ మీద తెలుగుదేశం వచ్చాను. మాష్టారిని చూసే అవకాశం వచ్చింది.

నే చదువుకున్న కాలేజికి వెళ్లాను. సహాధ్యాయి ఒకతను లెక్చరర్ అయ్యాడు. డేవిడ్ మాష్టారు రెండు నెలల కిందట రిటైరై బెజవాడ దగ్గర పల్లెటూర్లో ఉంటున్నారని చెప్పాడు నా సహాధ్యాయి.

"మాష్టారి రిటైర్మెంటును ఎలా తీసుకున్నారు?"

"ఆయనకేం, నిగర్వి. హోదాలో ఉన్నప్పుడు కళ్లు కానరాక, ఉద్యోగం డబ్బు - వీటి హోదా మనిషిదేనని విర్రవీగే మనుషులకైతే రిటైర్‌మెంటు శాపం కాని డేవిడ్ మాష్టారిలాంటి వాళ్ళకు అది సహజంగా వచ్చే వార్ధక్యం లాంటిదే."

"ఆయన దగ్గర చదువుకుని, ఆయనతో పాటు ఉద్యోగం చేయడం నీ అదృష్టం."

నాకు చాలా సంతోషమనిపించింది.

మాష్టారు ఆ రోజన్న మాట. కాదు సూక్తి మనసులో ఎప్పుడూ రింగురింగు మంటూనే వచ్చింది. ఆ ఆలోచన ఎవరిది? చాలా ప్రాచీనమైనది కావచ్చు. అది మొట్టమొదటిసారిగా ఏ హైందవ

గణితజ్ఞుడో, గ్రీకు తాత్త్వికుడో అన్నాడని తెలుసుకోవడానికి కొంత పరిశోధన కావాలి. కాని నామట్టుకు మాత్రం ఆ మాటలు మాష్టారివేననిపిస్తోంది. ఆ సత్యాన్ని మనసుకు హత్తుకునేటట్టు నాకు చెప్పినది ఆయనే కదా!

జీవితం ఎడల లోతైన అవగాహన మాష్టారి కుందన్న విషయం నాకు ఆ చిన్ననాటి రోజుల్లో తెలియలేదు. మనసున్న మనిషి అని మాష్టార్ని అందరూ అనేవారు. నేను మాత్రం దేవుడేనని అనుకునే వాడిని. దానికి కారణం ఆయన నా యెడల చూపిన ప్రత్యేక మైన ఆదరణ.

తిండిలేని రోజుల్లో ఇంటర్‌లో చేరాను. ఆ రోజుల్లో కాబట్టే అది సాధ్యమేమో నని అనిపిస్తూ ఉంటుంది ఇప్పుడు.

నేను మాష్టారి దగ్గరకు వెళ్ళి ఏ రోజూ నోరు మెదిపి కావాలని ఏదీ అడగ లేదు. అడగవలసిన అవసరం ఆయన నాకు ఎన్నడూ కలుగచెయ్యలేదు.

కష్ట సమయంలో నన్ను చాలామంది ఆదుకున్నారు. నేను అందరికీ కృతజ్ఞుడినే. కాని మాష్టారు నన్ను మనిషిని చేశారని నా ఉద్దేశం.

ఒకానొక తరుణంలో ఆత్మ హత్యకి తలపడ్డాను.

నాకు బాగా జ్ఞాపకం. ఆరోజు శనివారం. మధ్యాహ్నం రెండవ గంట మాష్టారి లెక్కలక్లాసు. మాష్టారు క్లాసుకి వచ్చిన మరో పావుగంటకి నేను చెమటలు కక్కుకుంటూ క్లాసులోకి వెళ్లాను. విధి నిర్వహణలో లీనమై మాష్టారు లెక్కలు చెబుతున్నారు.

కొంతసేపటికి మాష్టారి పాఠం ఆగిపోయింది. క్లాసులో పిల్లలంతా వెనక్కు తిరిగి నా వంక చూస్తున్నారు.

నాతల ముందు బల్లమీద పెట్టి నాకు తెలియకుండానే చంటి పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడుస్తున్నాను.

కొంతసేపటికి నేను మాష్టారి గదిలో ఉన్నాను. మాష్టారు నన్ను ఓదార్చుతున్నారు. కాలేజీకి కట్టవలిసిన జీతం ఆయన కడతానన్నారు.

ఆ రాత్రికి వాళ్ళింట్లోనే ఉండమన్నారు.

అప్పటికి నాకు ఆయన మంచి తనమే కాని స్థితిగతులు తెలియవు. ఆయన మంచితనం నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. నేను భరించలేక పోయాను. నేను నికృష్టంగా ఓ పూట తింటూ చదువుకుంటున్నాను. రోజూ ఎవరినైనా ఎన్నాళ్లు ఆదుకోగలరు? ఏదో భూతదయతో ఇంత తిండి అక్కడా ఇక్కడా పెడుతూనే ఉన్నారు. కాని ఫీజు? ఎంత మంది నడిగితే అది పోగవుతుంది?

మాష్టారి ఇంటిలో ఆ రాత్రి ఉన్నాను. ఆయన స్థితిగతులు తెలిశాయి. పెద్ద బ్బాయి మత గురువు శిక్షణ పొందుతున్నాడు. రెండవవాడు ఏదో పేపరులో పని చేస్తున్నాడని చెప్పారు. ఇద్దరు ఆడపిల్లలు. పెళ్ళికి ఎదిగిన వాళ్ళు. ముసలితల్లి. అనారోగ్యంతో ఉంటున్న భార్య - మూడువందల చిల్లర జీతంలో ఈ సంసారం మంచి కోసం తపన - జాలిగుండె - ఎముకలేని చెయ్యి - ఇది చాలు మనిషిని ఆర్థికంగా కృంగదియ్యడానికి.

మాష్టారి దగ్గర డబ్బు తీసుకుని నాకు జీతం కట్టడం ఇష్టంలేక పోయింది.

అర్థరాత్రి లేచి నేను బయటకు వస్తుంటే నన్ను డేవిడ్ మాష్టారు అటకాయించారు.

ఆత్మహత్య మహా పాపం. దేవుడి మీద విశ్వాసమున్నంతవరకూ నిరాశ నిన్ను ఆవహించదు. ఆత్మహత్య నిరాశకు సూచన, నిరాశ దేవుడిమీద విశ్వాసం లేకపోడాన్ని వెలిబుచ్చుతుంది. మా మతంలోనే కాదు, మీ మతంలో కూడా ఆత్మహత్య పాతకమని చెప్పడం నేను విన్నాను. ఇంతకీ నీకు నిరాశ దేనికి? ఈ ఒక్క సంవత్సరం కళ్ళు మూసుకుంటే, దైవకృపతో, గట్టి కృషితో నువ్వే మరి నలుగురిని ప్రోత్సహించ గలిగిన స్థితికి వస్తావు. నీ పని నువ్ చెయ్యి. నేను నీకోసం జీతం కడతానంటే నా తాహతుకు మించిన పని చేస్తున్నాని నువ్ సంకోచిస్తున్నావ్! అంతేగా! ఆరాట పడకు. నెలలో చాలా రోజులున్నాయని బాధ పడుతున్నావ్! రేపటి సంగతి భగవంతుడి కొదిలేద్దాం.

ఆ విషమ గడియ దాటిపోయింది. నా బలహీనత మటుమాయమై పోయింది.

దైవేచ్ఛ మళ్ళీ నాలో ఆత్మహత్య ఆలోచన రానే రాలేదు. కష్టాలకేం గంపెడొచ్చాయి. నిరాశ మాత్రం మరెన్నడూ రాలేదు. చీకటి గుంటలో పడబోతున్న నాకు చేయూతనిచ్చి మానసికమైన ధైర్యాన్నిచ్చి రక్షించారు మాష్టారు.

ప్రయోజకుడినై దేశమంతటా తిరిగాను. డబ్బు సంపాయించాను. మంచి పేరు తెచ్చుకున్నాను. డేవిడ్ మాష్టార్ని చూడాలని మనసు పీకుతోంది. మొక్కుకున్న తరువాత మొక్కు తీర్చకపోతే మనసు పీకుతుంది కాని నేను మొక్కుకోలేదు. కాని డేవిడ్ మాష్టార్ని చూడలేదని మనసు తిడుతోంది. మనసు తిట్టినట్టు పగవాళ్లు కూడా తిట్టరని నానుడి. నా బాధ్యతగా ఆయనను చూసి, ఇతోధికంగా ఆయన్ను గౌరవించాలనే ఆరాటం నాలో పెరుగుతోంది.

తెలుగుదేశం వేసేశారునన్ను. తెలుగు వాడినన్న అభిమానం కొన్నాళ్ళు బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నాక. దేశమంటే వచ్చాను కాని కొన్నాళ్ళ వరకూ ఆయన దగ్గరకు వెళ్ళడానికి వీలుకాలేదు. వయసుతో బాటు ప్రతి మనిషికి బాధ్యతలూ పెరుగుతాయి.

వీలు చూసుకుని నేను వాకబు చేసి మాష్టారి ఊరు వెళ్ళేసరికి జరగ కూడనిది జరిగిపోయింది.

"ఇంకెక్కడ మాష్టారు బాబూ! ఆయన పోయినెల రోజులయి పోయింది."

జీవిత విచిత్రం! ఎప్పుడూ అనారోగ్యంగా ఉండే మాష్టారి భార్య నాకు సమాధానం చెబుతున్నారు. ఎప్పుడూ నవ్వుతూ పలకరించే మాష్టారు మాయమై పోయారు.

కూచోమని బాగా చిరుగు పట్టిన బెత్తు కుర్చీ చూపించారావిడ. చుట్టూ చూశాను. బీదరికంతోనూ, దైన్యతతోనూ గోడలు మసిబారి బూజుపట్టి ఉన్నాయి. ఆ గదిలోని వెలుగంతా మాష్టారి ఫోటో నుంచే వస్తున్నట్టుంది.

పెంకుటిగది ముందు వరండాలో ఓ తడక. ఏసుక్రీస్తుకి నవీన నమూనా మాష్టారు రేపటికి ఉందా లేదా అన్న ప్రశ్న ఆయనకెప్పుడూ ఉదయించి నట్టు లేదు - ముసలి తల్లి - అకాలంగా ముసలి అయిపోయిన ఆయన పిల్లల తల్లి - వీరిద్దరూ ఆయన ఆదాయంలో చాలా భాగాన్ని ఖర్చు చేయించేవారు. మమతే ముఖ్యమైన మాష్టారు అడిగిన వాళ్ళకి లేదనకుండా ఇచ్చేసేవారు.

ఏ మాష్టారి దగ్గర ధైర్యం చేదుకుని బుద్ధిగ్రహణం నుంచి బయట పడ్డానో ఆ మనిషి నవ్వును కళ్ళారా చూసి నా కృతజ్ఞతని వెలువరించుదామనుకున్నానో, ఆ నవ్వు నాకు బూజు పూసుకున్న

గోడమీది ఫోటోలోనే సాక్షాత్కరించింది. ఆ ఫోటోకి ఎదురుగా అవతల గోడమీద మరీ నాలుగంగుళాల ఎత్తులో శిలువ మీదనున్న క్రీస్తు మాష్టారి కళ్ళలోకి జాలిగా చూస్తు న్నట్టు అనిపించింది.

ఇంటిలో ముగ్గుబుట్టలా నెరిసిపోయిన తలతో మాష్టారి భార్య తప్ప ఇంకెవ్వరూ లేరు.

నా చేతిలోని సంచి ఆవిడ కాళ్ళ దగ్గరుంచాను. ఆమె కళ్ళు నా వంక వైర్యాగంతో, జాలిగా చూస్తున్నాయి.

"అమ్మా, ఈ కష్టసమయంలో ఇలా మిమ్మల్ని చూస్తాననుకోలేదు. మాష్టారు నాకు విద్యాదానమే కాదు - ప్రాణ దానం కూడా చేశారు. ఆయన అభిమానానికి నేనెంతో ఋణపడి ఉన్నాను. వారిని చూసి పోదామని వచ్చాను...... అమ్మా, పిల్లలు......?"

"పెద్దాబ్బాయి మత గురువు శిక్షణ పూర్తికాకుండానే ఓ అమ్మాయిని పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయాడు. వాడి వివరాలు మాకు తెలియలేదు. ఈ దేశంలో లేడని ఎవరో వచ్చి చెప్పారు......"

"రెండో అబ్బాయి?"

"ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. మాష్టారికి వాడంటే ప్రాణం. వాడు ఇల్లు వదలి సుమారు ఐదేళ్లయి పోయింది. మాష్టారు ఎప్పుడూ ఏదో ఆలోచనల్లో ఉండేవారు......"

మాష్టారి మంచితనం పిల్లలను కాపాడలేక పోయిందన్న మాట!

"ఆడపిల్లలు?" - ఆవిడకు ఊరట కలిగించాలని ఆత్రం. విషయం పూర్తిగా తెలుసుకోవాలన్న ఆరాటం - రెండూ నాలో పోటీ పడుతున్నాయి.

"పెద్దమ్మాయి భర్త తాగుబోతయి పోయాడు. అమ్మాయి చనిపోయింది. స్టవ్ అంటుకుందని అల్లుడు మేం వెళ్ళిన తరవాత చెప్పాడు, చిన్నమ్మాయి నర్సు ట్రైనింగవుతోంది - మాష్టారికి పెద్దబ్బాయి అలా వెళ్ళి పోయాడన్న విచారం లేదు. రెండవ వాడు పరారయి పోయిన దగ్గరనుంచీ ఆయన మనసు మనసులా లేదు. రాత్రి నిద్ర పోయేవారు కాదు. నాకు ఏం అర్థం కాలేదు ఆయన వైఖరి."

"చిన్నబ్బాయి మాష్టారు పోయిన తరవాత వచ్చాడా?"

"మరెక్కడ చిన్నబ్బాయి? వాడి ఉనికి ఆనాటికి ఈనాటికీ తెలియనేలేదు. మాష్టారి నడిగితే ఎక్కడో క్షేమంగా ఉండే వుంటాడులే - ఎప్పటికయినా వస్తాడు. ధైర్యంగా ఉండు అనేవారు. వారి ధైర్యందైవంమీదున్న నమ్మకమే.

"పాపం, జబ్బుచేసిందా, ఆయన బాధ పడ్డారా?"

"జబ్బుచేసి పోయినా అదొక దారి. తెల్లవారి లేచి చూసేసరికి మంచం మీద నిద్రపోతున్న మనిషిలా అలాగే ఉన్నారు. ఆ రాత్రి మాత్రం ఎక్కడికో వెళ్ళివచ్చారు. ఆయన వెళ్ళడం, రావడం గురించి అడిగితే విసుక్కునే వారు. అలవాటయి అడగడం మానుకున్నాను."

"పాపం, చాలా గొప్ప మనిషి. ఆయనలాంటి మనుషులు అరుదు. దేవుడు ఆయన ఆత్మకి శాంతి ప్రసాదించుగాక!"

అంతకంటె ఇంకేం చెప్పాలో, ఏం చెయ్యాలో తోచక శెలవు తీసుకుని బయటకు వచ్చేశాను. గ్రామంనుంచి రోడ్డువరకూ నడిచాను. బెజవాడ బస్సుకోసం నుంచున్నాను.

ఒక జీపుదగ్గర పోలీసు అధికారి పోలీసుజీపు డ్రైవరూ దానితో ఏదో పాట్లు పడుతున్నారు.

జీపు వంకే చూస్తున్నాను నేను.

"హాయ్ రామావతారం!"

పోలీసు ఆఫీసర్ దుస్తుల్లో ఉన్నాయన పలకరించాడు. యూనిఫారమ్‌లో మొదటిసారిగా చూస్తే అన్నదమ్ముడినయినా గుర్తించడం కష్టమే.

"హలో!"

"నేను గుర్తులేనా?" హేట్ తీస్తూ ప్రశ్నించాడాయన.

"ఓహ్! మిస్టర్ జ్ఞానానందం! పోల్చుకోలేక పోయాను"

"మాష్టారి ఊర్నించి వచ్చినట్టున్నారు, పాపం, డేవిడ్ మాష్టారు..."

"ఆయన చాలా హఠాత్తుగా చనిపోయారట."

"మిమ్మల్ని నాకు బాగా గుర్తుంది. మీరు మాకు జూనియర్. మాష్టారు మీగురించి నాకు ఎన్నోసార్లు చెప్పారు. మాష్టారిగురించి మీతో..."

"బాగుపడేటట్టు లేదుసార్...." డ్రైవరు సవినయంగా మనవి చేశాడు.

"వైర్‌లెస్ మెసేజ్‌పంపు. మరోజీపు వచ్చేవరకూ ఇక్కడే వెయిట్ చేద్దాం. రండి రామావతారం గారూ."

పోలీసు కారుకు చాలా దూరంగా నడిచాం

"మాష్టారు ఆత్మహత్య చేసుకున్నారు."

"జ్ఞానానందంగారూ, వారూ క్రైస్త్రవులే! మాష్టారిని నాకంటె మీకు బాగా తెలుసు. మీ మతంలో ఆత్మహత్యని క్షమించరాని పాపంగా చెబుతారు, ఆయనకు ఆత్మహత్య చేసుకోవలసినంత కష్టమేం వచ్చిందో అవగాహన కావడంలేదు. బాగా చదువుకున్న మనిషి - మతం మీద నమ్మకమున్న వ్యక్తి ఇదేదో మిస్టరీలా ఉంది."

"మిస్టరీ ఏం లేదు రామావతారం. మాకు అన్నీతెలుసు. పోలీసు ఆఫీసర్‌గా అతనికి నేనేం చెయ్యలేక పోయాను. వృత్తి బాధ్యత అలాంటిది. మనిషిగా ఆయనకు నేను చెయ్యగలిగినది మీతో ఆయన విషయం పూర్తిగా చెప్పడమే."

నేను అడుగు ముందుకు వెయ్యకుండా ఆగిపోయాను.

"మాష్టారి కొడుకు విప్లవవాది- అందులో అతివాది. చాలా ఘోరమైన నేరాల్లో ఇరుక్కున్నాడు. అతను చంపినవాళ్ళు పందికొక్కుల్లాంటివాళ్ళయినంతమాత్రాన చట్టం అతన్ని క్షమించదు. మాష్టారి కొక్కరికే అతని వేర్ ఎబౌట్స్ తెలుసు. హత్యలకీ మాష్టారికీ సంబంధం ఉందంటే మనిషిగా నేను నమ్మను. ఆ అబ్బాయిమాత్రం దేశపు శాంతిభద్రతల విషయంలో వెన్నులో బల్లెంగా మారాడు. మాష్టారికి ఆ విషయం చెప్పి వార్న్ చెయ్యాలని వెళ్లాను. నన్ను కేవలం ఆఫీసర్‌గానే పరిగణించారు అతని కొడుకుకు అలాంటివాటిలో ఎట్టిసంబంధమూలేదని దబాయించేశారు. నేను మాష్టారి దగ్గరకు మళ్ళీ వెళ్ళలేదు. ఆయన పట్టుదల మనకు తెలియనిది కాదు. మరో వారానికి మాకు ఆర్డర్స్ వచ్చాయి. ఆ కుఱ్రవాడిని సజీవంగానైనా, మృతుడిగానైనా పట్టుకుని తీరాలని. మా నిఘా ఇంకా పటిష్టంచేశాం. మారువేషాల్లో మాష్టారి ఇంటి ప్రాంతంలో నలుగురు మనుషులుండేవారు. మాష్టారు ఈ విషయం

తెలుసుకోలేనంత అమాయకులుకారు... ఆ అబ్బాయి ఆచూకీ తెలియలేదు. ఇంక ఆయన్నే ఇంటరాగేట్ చేసే పరిస్థితి వచ్చింది. మరోగంటలో ఆయన మా చేతుల్లో ఉంటారు... కాని మేం వెళ్లే సరికి ఆయన శవమే మేం తీసుకోగలిగాం. డాక్టరు ఆత్మహత్యని మాకు చెప్పాడు! పాపం. మాష్టారి భార్య మాత్రం అయనకు గుండెపోటు వచ్చిందనే అనుకుంటోంది.

"మీకేసు..."

"దాని మాటకేం..."

"సారీ. కేసుమాట నా కనవసరం... మాష్టారి దగ్గర కెళ్ళినపుడు ఆయన ఏమన్నారు?"

"ఆయన ఓ పెద్ద లెక్చరిచ్చారు. దాని సారాంశం మాత్రమే మీకు నేనుచెప్పగలను. మన ఆర్థిక వ్యవస్థ. మన సమాజం-రాజకీయపరిస్థితి-ఇది ఎంతవరకు స్వయంకృతం-మన వారసత్వం మనంకోరి ఎంచుకోనట్టే ఈ వ్యవస్థ మనం ఎన్నుకున్నది కాదు, ఇది పూర్వజన్మసుకృతమా? దుష్కృతమా?--క్రిష్టియన్స్‌గా మనం దీన్ని నమ్మం. మన చుట్టూ ప్రజల్లో మనమూ భాగమే- వారి నమ్మకాలు మనకీ వారసత్వంతో వచ్చినవే,- నేను పూర్వజన్మనునమ్ముతాను. మన పూర్వజన్మ సుకృతానికీ, దుష్కృతానికీ, ఈ జన్మలో మన సుఖదుఃఖాలకి సంబంధం ఉందనడంలో కొంత లాజిక్ ఉంది- మన చుట్టు పక్కల పరిస్థితులు మన ఆలోచనాశక్తిని ఇగిర్చేస్తున్నాయి. రేషన్‌కోసం, పాలకోసం నీళ్ళకోసం-సీట్లకోసం-ఫారాలకోసం-అనునిత్యం క్యూల్లో మనజీవనకాలంలో చాలాభాగం గడిచిపోతోంది. రాజకీయ నాయకులు పందికొక్కుల్లాంటి వాళ్ళయినా వాళ్ళను మనం ఏం చెయ్యలేం. ఓటుహక్కు మనకి వరం కాలేదు- ఎందుకు బ్రతుకుతున్నామో, జీవితానికి గమ్యమేమిటో మనకి తెలుసుకోడానికి తెలిసినవాళ్ళకి గుర్తు చేసుకోడానికి తీరికలేదు-ఇచ్ఛ చచ్చిపోతోంది....తిండికిలేక ప్రజలు ఒక వంక అలమటించిపోతుంటే వాళ్ళదగ్గర ఓట్లుదోచుకుని వాగ్దానాలతో వాళ్ళనోళ్ళు మూస్తున్నారు నాయకులు-వీటికి పరిష్కారం ఎక్కడుందో, ఎలావస్తుందో తెలియడం లేదు. పరిష్కారం అంటూ ఉంటే ఏదో ఆలోచనలోనే ఉండాలి. ఆలోచనను పాడుచేయడమంటే, ఆదర్శాన్ని పెంచుకోడమంటే మనిషిగా బతకాలనుకుంటే జిజ్ఞాసువు కావాలనుకుంటే, జీవితానికి ధ్యేయం జీవించడమొక్కటే కాదనుకుంటే-ముందడుగులో సగం భాగం తగ్గించుకుంటూ అవతల చివరను చేరాలనుకోవడమన్నమాట-ఆశకి హద్దులుంటాయి."

"జస్ట్ ఎ మినిట్; మిస్టర్ జ్ఞానానందం...ఓరోజు డేవిడ్‌మాష్టారు క్లాసులో ఇదే ఉదాహరణగా ఇచ్చారు. ఆ మాటలు నా మనసులో నిలిచి పోయాయి. "నువ్ వేసే అడుగును ప్రతిమాటూ సగం చేసుకుంటూపోతే నువ్వు గది అవతల చివర చేరలేవు."

"పాసిబుల్, కాని బోధపడనిదల్లా ఒక్కటే-ఆ కొడుకుతో నాకు సంబంధం లేదని రాసిచ్చి ఉంటే మావాళ్ళెవ్వరూ అయన జోలికి పోయేవారు కారు."

"మాష్టారి ప్రయత్నం ప్రతిఅంగకూ దూరాన్ని రెట్టింపుచేసుకుంటూ గాలిలో ఎగరాలని-అసంభవ ప్రయోగం-మనిషిగా ఆశయాలనే రెక్కలతో ఎగురుదామని ధైర్యం-అందని ఆశలను ఆరాధిస్తే మనిషికి మిగిలేది నైరాశ్యం కాకపోతే మరేముంది?"

"నిజమే. మాష్టారికి ఆ కొడుకు ఎక్కడున్నదీ, ఏంచేస్తున్నదీతెలుసు. అలాంటి పనుల్ని సంఘం, ఎంత కుళ్ళుదైనాసరే, ప్రభుత్వం ఎంత నీతిమాలినదైనాసరే-సహించదనీ తెలుసు. కాని తన ప్రాణాన్ని

బలిఇచ్చి కొడుకు రహస్యాన్ని దాచుదామనుకున్నారు మాష్టారు-ఎప్పుడైనా తెలిసిపోయే రహస్యాన్ని ఎందుకు దాచాలనుకున్నారు? క్షమించరాని పాపమైన ఆత్మహత్యకు ఎందుకు తెగించారు? ఇది నాకు అవగాహన కావడంలేదు."

-నాకు నేను చేసిన ఆత్మహత్యా ప్రయత్నం-మాష్టారు నన్ను వారించిన విషయం చెబుదామని నాలుక చివర వరకూ వచ్చింది. కాని నిగ్రహించుకున్నాను.

"మిస్టర్ జ్ఞానానందం-మీరు పోలీసు అధికారులు-మోటివ్స్ తెలుసుకోవడం మీ బాధ్యత. నాకు తెలిసిన విషయం నేను చెబుతా. మాష్టారి ఆత్మహత్య మామూలు ఆత్మహత్య కాదు. అందులో మతపరమైన నైరాశ్యతలేదు. అది క్షమించరాని పాపమూ కాదు. దయామయుడైన భగవంతుడిని నిత్యం అనుక్షణం ఆరాధించే మనిషి ఆయన కృపకు కరువుండదు. మాష్టారు లెక్కల మాష్టారు. ఈక్వేషన్ అలా ఉన్న తరువాత రిజల్ట్ రావడం తప్పదు కదా- మాష్టారి ఆత్మహత్య గణితజ్ఞుడి బుద్ధి సూక్ష్మతను ఋజువుచేసే ఒక చర్య- ఆయన నరకానికి పోతారని నే ననుకోను- కాని వాళ్ళబ్బాయి..."

"మా దగ్గరే ఉన్నాడు-స్టేషన్‌కు వస్తే..."

"థాంక్స్ మిస్టర్ జ్ఞానానందం- మాష్టారి ఎడల గౌరవభావం చూపడానికి మార్గం మాష్టారి ఆత్మశాంతి కోసం ప్రార్థించడమే-"

-పోలీసుజీపు హారన్ వినపడింది.

బస్సులోనే వెళతానన్న నన్ను చూసి జ్ఞానానందం అన్నాడు. "ప్రజలు మమ్మల్ని నమ్మరు- చదువుకున్నవాళ్లూ నమ్మరు-స్నేహితులూ నమ్మరు- ఐ కాన్ట్ హెల్ప్ ఇట్." అతని మాటల్లో నాకు నిట్టూర్పే వినపడింది.

స్వాతి, జూన్, 1980